గృహసారథులే సంక్షేమ వారధులు



సమావేశంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, ఎస్.ఎ.రెహమాన్ తదితరులు



హాజరైన 60, 61 వార్డుల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు

- అర్హులందరికీ పథకాలు అందేలా చూడండి
- ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోండి
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులపై ఉందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 60, 61 వార్డులకు చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంస్థల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆడారి కార్యాలయం వద్ద ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్ సభాధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అతిథిగా పాల్గొన్న ఆనంద్‌కుమార్ గృహసారథులు, కన్వీనర్లతో పరిచయం కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ప్రతి గృహసారథి, కన్వీనర్, ఆయా ప్రాంతాల వార్డు వలంటీర్లతో కలిసి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకం అందకుంటే ఏ కారణం చేత నిలిచిందో పరిశీలించి, తక్షణం అందేలా చూడాలని సూచించారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే క్షమించేది లేదన్నారు. ప్రతి ఒక్క గడపకూ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుతున్న సాయం తదితర అంశాల గురించి తెలుసుకుని నివేదిక తయారు చేయాలన్నారు. అనంతరం గృహసారథులకు 'మా నమ్మకం నువ్వే జగన్' కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్, 60వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

- కార్యక్రమ అనంతరం ఇదే వేదిక వద్ద 58, 59 వార్డులకు సంబంధించి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. ఆయా వార్డుల కార్పొరేటర్లు గులిగిందల లావణ్య, పుర్రె పూర్ణశ్రీయాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న విజయచైతన్య



ఆలయ పూజల్లో పాల్గొన్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం మూడు ఆలయాల వద్ద సుబ్రహ్మణ్య స్వామి 18 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వార్షికోత్సవ పూజలు చేశారు. పూజల్లో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, బెహరా విద్యాసంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య పాల్గొన్నారు. విగ్రహ దాత మద్ది రమేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, కమిటీ సభ్యులు గొంతెన గణేష్, గొంతిన నాగరాజు, చింతల శ్రీను, పల్లా సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



ఏకేసీ కాలనీలో మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 63వ వార్డు ఏకేసీ కాలనీ 1086321 సచివాలయంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలకా రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ నేతృత్వంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ట్రేడ్ యూనియన్ నాయకుడు కలిదిండి బద్రీనాథ్‌తో కలిసి ఆడారి ఆనంద్‌కుమార్ 300 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకుని, లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం దిశగా సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టనున్నారని, ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో 40, 60, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, పీవీ సురేష్, బల్ల లక్ష్మణరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు బాక్సింగ్ పోటీలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పవనపుత్ర నగర్‌లోని జీవీఎంసీ మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించనున్నారు. రఘు మెమోరియల్ బాక్సింగ్ క్లబ్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా పలు విభాగాల్లో బాల, బాలికల మధ్య పోటీలు జరగనున్నాయి. సోమవారం సాయంత్రం ముగింపు కార్యక్రమంలో విజేతలకు మెమొంటోతోపాటు సర్టిఫికెట్ అందిస్తామని నిర్వాహకుడు ఎస్.వి.రమణ తెలిపారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శంకరశర్మ, జగన్నాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

విమాన్‌నగర్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో స్థానికుడు వట్టి సత్యనారాయణ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, స్థానికులు శనివారం చలివేంద్రం ప్రారంభించారు. వీవీఆర్ వాటర్ ప్లాంట్ సౌజన్యంతో శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్, విమాన్‌నగర్ షటిల్ ప్లేయర్స్ సంయుక్త ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వి.వి.రమణమూర్తి, గణేష్, షటిల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వద్దు

దాబాగార్డెన్స్: రక్తదానంపై శనివారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జిలు దుర్గాప్రసాద్, అంజిత, స్వామి వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, ప్రముఖ సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రక్తదానంపై చాలా మందికి అపోహలున్నాయని, అది ఎంత మాత్రం నిజం కాదన్నారు. ప్రతి మూడు నెలలకి ఒకసారి రక్తదానం చేయడం వల్ల మనిషి చాలా ఆరోగ్యంగా ఉంటాడని, హెచ్‌బీ 12.5 ఉంటే ఎవరైనా రక్తాన్ని దానం చేయవచ్చని పేర్కొన్నారు. రక్తదానం చేసిన తర్వాత ఆ రక్తాన్ని అనేక పరీక్షలు చేసి పేషెంట్‌కు అందిస్తారన్నారు. ఆ టెస్టుల్లో ఏమైనా వ్యాధులుంటే బయటపడతాయని, ఆ పేషెంట్‌ని పిలిచి కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. మెడికల్ ఆఫీసర్ అంజిత మాట్లాడుతూ ఏడాదిలో దేశం మొత్తానికి 14.6 మిలియన్ యూనిట్ల రక్తం కావలని.. అయితే 11.5 మిలియన్ యూనిట్ల రక్తం మాత్రమే లభిస్తుందన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రెండో రోజూ విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి పని ప్రదేశం వద్ద కూర్చున్న కార్మికులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులు చేస్తున్న స్థానికేతర కార్మికులు రెండో రోజూ శనివారం కూడా విధులు బహిష్కరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. పనిముట్లు విడిచి తాము పనిచేస్తున్న సైట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ సంస్థ)లో రెండేళ్లుగా విస్తరణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. వీటిలో స్థానికేతర కార్మికులు(నార్త్ ఇండియన్స్) అధికంగా పనిచేస్తున్నారు. పనికి తగ్గ వేతనం రఫ్ అనే సంస్థ యాజమాన్యం ఇవ్వడం లేదని, పనిలో కనీస వసతులు లేవనే సమస్యలపై కార్మికులకు వారం నుంచి సదరు కాంట్రాక్టర్‌కు వివరిస్తున్నారు. ఎవరూ స్పందించకపోవడంతో నిరసన కొనసాగిస్తున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జగద్గురు పీఠం, డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెవెన్‌హిల్స్ హాస్పిటల్ సౌజన్యంతో హృద్రోగ నిపుణులు డాక్టర్ ఎం.ఎస్.రాజు, డాక్టర్ సిహెచ్.వరప్రసాద్ పర్యవేక్షణలో గుండె వ్యాధుల పరీక్షలు ఈసీజీ, బీపీ, సుగర్, పలు రక్త పరీక్షలు జరపనున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి, పూర్తి వైద్య సహాయం అందచేస్తామన్నారు. స్థానికులు వైద్య శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని సత్యదేవ్ కోరారు.

గౌరీదేవికి సారె సమర్పణ



సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

- వైభవంగా అనుపు ఉత్సవం

గోపాలపట్నం: గౌరీ దేవికి మహిళలు పెద్ద ఎత్తున సారె సమర్పించారు. కొత్తపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా శనివారం అనుపు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. కొత్తపాలెం పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి వివిధ వంటకాలతో సారె సమర్పించారు. ఎమ్మెల్యే గణబాబు, స్థానిక కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, గౌరి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరసతో కిటకిటలాడిన రహదారులు

అనుపు మహోత్సవాల్లో భాగంగా సాయంత్రం పరస జరిగింది. దీంతో రహదారులు కిటకిటలాడాయి. స్థానికులు కుటుంబ సభ్యులతో హాజరు కావడంతో అంతటా సందడి నెలకొంది. పరసలో గృహోపకరణాలు, వివిధ రకాల వస్తువులు, రంగుల రాట్నాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గంజాయి కేసులో ఏయూ సెక్యూరిటీ గార్డుల అరెస్టు

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పరిధిలో గంజాయి కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఏయూలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న చంద్రమౌళి, అప్పలరాజు, సురేష్ వద్ద అక్రమంగా 500 గ్రాములు గంజాయిని గుర్తించారు. ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేసి శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బీసీల అభ్యున్నతికి కృషి



అసోసియేషన్ కొత్త అధ్యక్షుడు రవికుమార్‌కు నియామక పత్రం అందిస్తున్న వెంకటేశ్వరరావు

సీతంపేట: బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పెబ్బిలి రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సంఘ జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిహార్ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని అన్ని రాష్ట్రాల్లో కులాల వారీగా జనాభా లెక్కలు తయారు చేయాలని సూచించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా కులాల వారీగా జనగణన జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. పెబ్బిలి రవికుమార్ మాట్లాడుతూ బీసీలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కమిటీలను నియమించి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకర్ల రాజారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు, ఊర్వశి మహాలక్ష్మి, చిత్రాడ అప్పారావు, శంకరరావు, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, వెంకటరమణ, ఈశ్వరరావు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాట స్ఫూర్తి అ'ద్వితీయం'

- కొనియాడిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- ఉక్కు ఉద్యమం ప్రారంభించి రెండేళ్లు
- నేడు డాక్యుమెంటరీ ఆవిష్కరణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మికుల పోరాటం అద్వితీయమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 2021 ఫిబ్రవరి 12న ప్రారంభమైన ఉద్యమం, రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటలకు కూర్మన్నపాలెంలోని దీక్ష శిబిరం వద్ద విశాఖ ఉక్కు పేరుతో డాక్యుమెంటరీని వైజాగ్ స్టీల్ ఫ్యామిలీ యూట్యూబ్ చానల్‌లో కె.కె.రావు చేతుల మీదుగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కూర్మన్నపాలెం కూడలిలో రిలే నిరాహార దీక్షల్లో 730వ రోజు శనివారం సంస్థకు చెందిన ఎల్ఎంఎంఎం మరియు ఎస్‌బీఎం విభాగ కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, డి.సురేష్, డి.శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర ప్రసంగించారు. విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అన్నారు. దానిని కాపాడుకునేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారన్నారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణలో తగ్గేదే లేదని, కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

నేటి నుంచి మతసామరస్య వారోత్సవాలు

మద్దిలపాలెం: ప్రపంచ మతసామరస్య వారోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్టు బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీస్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్, గాంధీ సెంటర్ ప్రతినిధి నరవ ప్రకాశరావు ప్రకటనలో తెలిపారు.

తెలుగుభాష సదస్సు వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21, 22తేదీల్లో అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన వెబ్‌సైట్ www. telugu.inను ఏయూ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సమావేశాల రూపకర్త డాక్టర్ మూర్తి రేమళ్ల ఇస్రో శాస్త్రవేత్త మార్గదర్శనంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులతో తయారు చేసిన ఈ వెబ్‌సైట్‌లో సమావేశాలకు సంబంధించిన అన్ని వివరాలను ఒకే చోట నిక్షిప్తం చేస్తున్నారు. ఇంకా ప్రత్యక్షంగా పాల్గొనలేని వారికి ప్రత్యక్ష ప్రసారం లింక్ కూడా దీనిలో ఉంచడం జరుగుతోంది. రెండు రోజులు జరిగే సమావేశాలలో 12 సదస్సులు 70 మంది వక్తలు, ఆచార్యులు పరిశోధకులు వివిధ దేశాల మాతృభాషా ప్రేమికులు, సాహితీవేత్తలు పాల్గొంటారు. టీఎల్ఎన్ సభామందిరం వేదికగా ఈ సమావేశాలు జరుగుతాయి.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు చక్రవర్తి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ



హెల్మెట్ ధారణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వాహన చోదకులు

మర్రిపాలెం: హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద శనివారం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో ఎస్ఐ పాపారావు హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన 20 మందికి కౌన్సెలింగ్ చేసి జరిమానా విధించారు. 'వినాయకుడి చిత్రంతో కూడిన తలపోతే మళ్లీ రాదు' అనే అవగాహన ప్లకార్డు ప్రదర్శించారు. మరో ప్లకార్డులో హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి అంటూ వాహన చోదకులకు అవగాహన కల్పించారు. 69 మంది వద్ద పాత చలానాలు సుమారు రూ.11,370 వసూలు చేశామని ఎస్ఐ పాపారావు తెలిపారు.

డాక్‌యార్డ్‌లో ఉద్యోగి మృతి

మల్కాపురం: డాక్‌యార్డులో విధులకు వెళ్లిన ఓ ఉద్యోగి విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 58వ వార్డు పరిధి రామ్‌నగర్ ప్రాంతంలో ఒడరేవుల కుమార్‌స్వామి (35) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. నేవల్ డాక్‌యార్డ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌కు డ్యూటీకి వెళ్లాడు. అనంతరం 8.15 గంటల సమయంలో డాక్‌యార్డ్‌లోని డాక్ వద్ద గల ఓ నౌక దిగువన కుమార్‌స్వామి నీటిలో మునిగి ఉన్నట్టు ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సహచర ఉద్యోగులు గుర్తించారు. వెంటనే వారు ఉన్నతాధికారులకు సమాచారమివ్వడంతో కుమార్ స్వామిని ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. వెంటనే అధికారులు మల్కాపురం పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి వెళ్లి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హజ్ యాత్రకు దరఖాస్తు గడువు 10



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ ఇమ్రాన్

గాజువాక: ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు వెళ్లనున్న ముస్లింలకు విజయవాడలో బయల్దేరే (ఎంబార్కేషన్) పాయింట్‌ను ఇవ్వడంపై స్థానిక ముస్లిం మత పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 66వ వార్డు కార్పొరేటర్, హజ్ కమిటీ సభ్యుడు మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ విజయవాడలో ఎంబార్కేషన్ కలిపించడంపై ముఖ్యమంత్రికి, హజ్ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ విషయంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా విశేష కృషి చేశారన్నారు. దీనిపై హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్ యాత్ర షెడ్యూల్‌ను కూడా విడుదల చేసిందని, ఈ యాత్రకు వెళ్లాలనుకునేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని, ఆసక్తిగలవారు www. hajcommittee. gov. in, www. apstatehajcommittee. com ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల పాస్‌పోర్టు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు చెల్లుబాటులో ఉండాలని, కోవిడ్ వ్యాక్సినేషన్ చేయించుకుని ఉండాలని స్పష్టం చేశారు. ఇతర వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004257873, 08662471786లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, వివిధ మసీదు కమిటీల ప్రతినిధులు ఎస్.ఎం.డీ. గౌస్, అలియా నురాని, దుబాయ్ బాషా, ముఫ్తీ జాఫర్, అతుల్ రెహ్మాన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.